క్లుప్తంగా

ముమ్మరంగా డ్రైనేజీ పనులు



21వ వార్డు ఎఫ్‌సీఐ-2 కాలనీలో వేగంగా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

కల్లూరు : కల్లూరు అర్బన్ పరిధి 21వ వార్డులో ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి నగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎఫ్‌సీఐ-2 కాలనీ, లేపాక్షి నగర్‌లలో రూ. 70లక్షలతో, పార్థసారథి నగర్‌లో రూ. 50లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపట్టారు. ఆయా కాలనీలు ఎర్పడి ఎన్నో ఏళ్లు అయినా గత ప్రభుత్వాలు, మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించలేదు. వైఎస్సార్‌సీపీ నగర పాలక వర్గం ఏర్పడ్డాక తమ కాలనీలో సమస్యలు పరిష్కారమవుతున్నాయని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొగటవీర క్షత్రియ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శేషాద్రి

పాణ్యం : మండల కేంద్రానికి చెందిన దాసరి శేషాద్రి తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మేడలం వీరాంజనేయస్వామి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కుల సంఘం అభివృద్ధికి పాటుపడతామని, ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చేస్తామన్నారు.

వరి పైరు కళకళ



పులకుర్తిలో కళకళలాడుతున్న వరిపైరు

కోడుమూరు రూరల్ : మండలంలో బోరుబావుల కింద సాగు చేసిన వరిపైర్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మండలంలోని పులకుర్తి, కల్లపరి, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల, లద్దగిరి, అల్లినగరం గ్రామాల్లో సుమారు 450 ఎకరాల్లో వరిని బోరు బావుల కింద సాగు చేశారు. ప్రస్తుతం వరిపైర్లు కంకి దశ చేరుకోవడంతో పాటు, మరో నెలరోజుల్లో పంట చేతి కొస్తుందని రైతులు తెలిపారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: దివ్యాంగుల సౌకర్యార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీని చేయించుకోవాలని సూచించారు.

1నుంచి శ్రీదస్తగిరయ్య ఉరుసు



కోడుమూరులో వెలసిన శ్రీహజరత్ దస్తగిరయ్య దర్గా

కోడుమూరు రూరల్ : నవంబర్ 1వతేదీ నుంచి కోడుమూరులోని కోటవీధిలో వెలసిన శ్రీహజరత్ దస్తగీరయ్య స్వాముల ఉరుసు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నిసార్ అహమ్మద్ తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 1న గంధం, 2వ తేదీ కిస్తీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కిస్తీల సందర్భంగా మధ్యాహ్నం దర్గా ఆవరణలో దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిసార్ అహమ్మద్ తెలిపారు. భక్తాదులు ఉరుసు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులవ్వాలని ఆయన సూచించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కోడుమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వర్కూరుకు చెందిన రవీంద్రనాథ్ రెడ్డి, మనోహర్ ఆచారి, కోడుమూరుకు చెందిన కమ్మరి వెంకటేష్ మట్కా ఆడుతుండగా ఆదివారం దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మట్కా చీటీలతో పాటు, రూ.15వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మట్కా ఆడినా, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(రాజ్‌విహార్): నెల్లూరు జిల్లా కావలి దగ్గర ఆర్టీసీ డ్రైవర్ రాంసింగ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా రవాణా శాఖ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కర్నూలు-1, 2 డిపో గ్యారేజీల వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే డ్రైవర్లపై దాడులు తగవన్నారు. సంఘం నాయకులు మహేష్, మోహన్‌రావు, మద్దిలేటి పాల్గొన్నారు.

మహిళా శక్తి.. ఆర్థిక ప్రగతి

- ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం మహిళా శక్తి పథకానికి శ్రీకారం
- ఆటో కొనుగోళ్లకు వడ్డీలేని రుణం మంజూరు
- జిల్లాకు 9 మంది చొప్పున యూనిట్ల పంపిణీ

గడివేముల: అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా ప్రగతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని వర్గాల్లోని మహిళలకు న్యాయం చేసిన జగనన్న సర్కారు మరో అడుగు ముందుకు వేసింది. ఎస్సీ, ఎస్టీ మహిళల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక భరోసా కల్పించి, వారిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఉన్నతి మహిళా శక్తి పథకాన్ని ప్రభుత్వం తీసుకువస్తోంది.

అర్హత ఉన్నవారికి రూ.3లక్షల చొప్పున రుణం

వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ద్వారా మహిళా శక్తి పథకంలో భాగంగా ఆటోల కొనుగోళ్లకు వడ్డీలేని రుణం ఇస్తారు. అర్హులైన ప్రతి లబ్ధిదారురాలికి రూ.3లక్షల చొప్పున రుణం మంజూరు చేస్తారు. ఈ రుణాన్ని వడ్డీ లేకుండా వాయిదాల పద్ధతిలో తీర్చుకునే వెసులుబాటును కల్పించారు. జిల్లాకు తొమ్మిది మంది చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 220 యూనిట్ల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా మన జిల్లా నుంచి తొమ్మిది మంది లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో ఏపీఎంలు నిమగ్నమయ్యారు. డిసెంబరు 6వ తేదీన ఈ పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.





పొదుపు మహిళలకు పథకంపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం హజరత్, ఆటో నడుపుతున్న మహిళ

ఇవీ అర్హతలు..

- స్వయం సహాయ సంఘ (ఎస్ హెచ్) సభ్యురాలై, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారై ఉండాలి.
- గతంలో ఎటువంటి రుణం తీసుకుని, ఉండకూడదు.
- లబ్ధిదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- డ్రైవింగ్ చేస్తూ తీసిన వీడియో ఉండాలి.
- ఆటో కొనుగోలు చేసినపుడు 10 శాతం వాటాను మూలధనంగా పెట్టుబడి పెట్టాలి.
- గ్రామీణ ప్రాంతంలో నివసించి ఉండాలి.
- డీజిల్ ఆటోనా, గ్యాస్ ఆటోనా, ట్రాలీ ఆటో నా అనేది లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.
- స్వయం సహాయక గ్రూపు, వీఓ తీర్మానం తప్పనిసరి.

వాయిదా పద్ధతిలో చెల్లింపు సౌకర్యం..

లబ్ధిదారురాలి పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలి. లబ్ధిదారులే వాటి ఫీజులు భరించాల్సి ఉంటుంది. 48 నిర్ణీత వాయిదాల్లో వడ్డీలేని రుణం చెల్లించాలి. సకాలంలో లోన్ (రుణం) చెల్లించని వారికి అప రాధ రుసుం విధించబడుతుంది.


ఎంపిక చేయడం చాలా సంతోషం



ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న ఉన్నతి మహిళా శక్తి పథకానికి నన్ను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే నంద్యాల డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఆటో నడిపేందుకు లైసెన్స్ పొందాను. మా గ్రామంలో ప్రతి రోజూ నా భర్త ఆటోను నడుపుతున్నాను. త్వరలో ప్రభుత్వం ఈ పథకం కింద ఆటోను మంజూరు చేయించుకుంటాను.

–లక్ష్మీదేవిబాయ్, ఎల్‌కేతండా, గడివేముల

నంద్యాల జిల్లాలో 10మంది



జిల్లాలో ఇప్పటివరకు 10మందిని మహిళా శక్తి పథకానికి ఎంపిక చేశాం. వీరికి ఆటో నడపడం, రిపేరు వంటి అంశాలకు సంబంధించి, లబ్ధిదారులకు విజయవాడ ప్రత్యేక శిక్షణ ఇస్తాం. శిక్షణ కాలంలో శిక్షణార్థులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తాం.

– శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, నంద్యాల జిల్లా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామంలో నేడు సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం కార్యక్రమం ఉంటుందని, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల పొందిన లబ్ధిని వివరిస్తారన్నారు.

సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు

పాణ్యం: సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు మరింత విస్తరిస్తున్నట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ మండల అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి అన్నారు. ఆదివారం కేఆర్ఆర్ పాఠశాలలో సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మానవ స్వచ్ఛంద సంస్థను సభ్యులు, ప్రజల సహకారంతో విజయవంతంగా నడిపిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో కూడా అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అలాగే నూతన సభ్యత్వాన్ని కతూడా ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు నాగేంద్రప్ప సంస్థకు రూ.20వేలు విరాళంగా ఇచ్చారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలుపుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.531 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయండి

సి.బెళగల్: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర ఈనెల 30న కోడుమూరుకు చేరుకుంటుందని, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులతో కలిసి మండలంలో పర్యటించి, బహిరంగ సభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ, ప్రజా పరిపాలన, ప్రజా హక్కుల పరిరక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను చేపట్టడం జరిగిందన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు కోడుమూరు పట్టణంలో జరిగే బహిరంగ సభ మండల ప్రజలు భారీ ఎత్తున హాజరుకావాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు సుందర్రాజు, ఇబ్రహీం, భాస్కర్, జైలు, రాముడు, సాంతన్న తదితరులు ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

కోడుమూరు రూరల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకుల సమావేశం జరిగింది. రంగస్వామి మాట్లాడుతూ ఆంధ్రుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. పై డిమాండ్ల సాధనలో భాగంగా నవంబర్ 8న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్దు, మహమ్మద్, దినేష్, ముఫీద్‌లున్నారు.

లబ్ధిదారులకు ప్రభుత్వంపై భరోసా

- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- బలపనూరులో 'గడప గడపకు–మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు పొందిన లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై భరోసా ఉందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బలపనూరు గ్రామంలో గడప గడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత ఉంటే ఎలాంటి సిఫారసు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఇదో అధ్యాయమన్నారు. గడప వద్దకు వెళ్లినప్పుడు ప్రజలే తమకు ఫలానా పథకాలు అందాయని చెబుతున్నారన్నారు.

జగనన్న కాలనీలో పూర్తి స్థాయి సదుపాయాలు

బలపనూరు గ్రామంలోని జగనన్న కాలనీలో అంతర్గత రోడ్లు వేసి, విద్యుత్ సౌకర్యం, మంచినీరు, ఇతర సదుపయాలు కల్పిస్తామన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా మరిన్ని అదనపు సౌకర్యా లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులను కూడా త్వరలోగా విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాగునీటి సమస్య రానివ్వం

ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య రానివ్వమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది తక్కువ వర్షాల కారణంగా ఉన్న నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూ ర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ సొదం మాధవి, ఎంపీటీసీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్ల శ్రీకాంత్ రెడ్డి, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రుడు, వడ్డు గండ్లరాముడు, ఎల్లక్రిష్ణ, ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన పెంచండి



మాట్లాడుతున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన పెంచాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ మాట్లాడుతూ... వ్యవసాయంలో విత్తనశుద్ధికి ఎంతో ప్రాధాన్యత ఉందని, విత్తనం ద్వారా వ్యాపించే చీడపీడలను సమర్థవంతంగా నివారించుకోవచ్చని చెప్పారు. చాల మంది రైతులు విత్తనశుద్ధి చేసుకోకుండానే విత్తనాలు విత్తుకుంటారని, దీంతో పంటలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. విత్తనాలను శిలీంద్ర నాశినితో శుద్ధిచేసి, విత్తనం వేయుటకు ముందు జీవ శిలీంద్ర నాశినితో విత్తనశుద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని ఇన్‌పుట్ డీలర్లను కోరారు. దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... నిల్వ చేసిన ధాన్యంలో ఆశించు పురుగులు, వాటిని నియంత్రించు పద్ధతులను వివరించారు.ధాన్యం నిల్వ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పురుగుల వల్ల 20–25 శాతం వరకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ప్రతి అవసరానికి ముందు సంప్రదించేది ఇన్‌పుట్ డీలర్లనేనని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఆర్.కొంతలపాడు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 9 నుంచి 11 వరకు అన్నమయ్య జిల్లాలో నిర్వహించనున్న 63 వ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆర్.కొంతలపాడు గ్రామానికి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో 8 వ తరగతి చదువుతున్న హెచ్.ఆర్. రామ్‌చరణ్, బాలికల విభాగంలో ఎస్. శివవాణి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సావిత్రి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్ ఆదివారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- విశ్రాంత ఉద్యోగులు తరచూ బీపీ, షుగర్ చెక్ చేయించుకోవాలి
- విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ధనరాజ్
- విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): విశ్రాంత ఉద్యోగులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కర్నూలు సర్వజన వైద్యశాల విశ్రాంత ప్రొఫెసర్ (మెడిసిన్) డాక్టర్.టి.ధనరాజ్ తెలిపారు. బీపీ, షుగర్ అప్పుడప్పుడు చెక్ చేయించుకుంటూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం కర్నూలు అబ్బాస్ నగర్‌లోని ఎస్‌సీబీ పార్క్‌లో విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్.టి.ధనరాజ్ పెన్షనర్లకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ,షుగర్ పరీక్షలు కూడా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కర్నూలు శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. 80 మంది రిటైర్డ్ ఉద్యోగులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు.అనంతరం డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చాల మంది ఆరోగ్యాలను పట్టించుకోరని, ఇటువంటి వారి కోసం అసోసియేషన్ ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. బీపీ, షుగర్ అదుపులో ఉంటే ఆరోగ్యం బాగా ఉన్నట్లేనని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయాలని, దీని వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కర్నూలు శాఖ నేతలు, విశ్రాంత డీఎఫ్ఓ జయచంద్రరెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా.. నమ్మకంగా!

- ఆధునిక కాలానికి అనుగుణంగా తపాలాశాఖ సేవలు
- ప్రైవేటు కొరియర్ల కన్నా వేగంగా బట్వాడా
- విదేశాలకు 72 గంటల్లోనే పార్శిల్



కర్నూలు హెడ్ పోస్టాఫీస్

కర్నూలు (న్యూటౌన్): మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, విధి విధానాలు సడలింపు చేసుకుంటూ తపాలాశాఖ సేవలందిస్తోంది. ఇందులో భాగంగానే అత్యాధునిక బహుళ ప్రయోజనాలు కలిగిన సేవలను ప్రవేశపెట్టింది. వీటి ద్వారా దేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్నవారికి సైతం నమ్మకంగా.. వేగంగా పార్శిళ్లను చేరవేస్తోంది.

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్..

వరల్డ్ నెట్ ఎక్స్‌ప్రెస్ ద్వారా దేశ విదేశాలలో నివశిస్తున్న ఎన్ఆర్ఐలకు వివిధ రకాల వస్తువులను 72 గంటల్లో పంపే సౌకర్యం తపాలాశాఖ కల్పిస్తోంది.

స్పీడ్ పోస్ట్..

స్పీడు పోస్ట్ సౌకర్యం ప్రపంచీకరణలో భాగంగా విస్తృతమైనది. ప్రైవేట్ కొరియర్ల కన్నా నమ్మకంగా, వేగవంతంగా బట్వాడా జరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, బీమా, బ్యాంకింగ్, చిట్‌ఫండ్ కంపెనీలు పూర్తిగా స్పీడ్ పోస్టు పైనే ఆధారపడుతున్నాయంటే దీని విశ్వసనీయతను అంచనా వేయొచ్చు.

కోర్ బ్యాంకింగ్ సేవలు..

కోర్ బ్యాంకింగ్ సేవలు 2014లో దేశ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. దీంతో సేవింగ్స్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా ఖాతాదారులకు ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలందిస్తూ మన్ననలు పొందుతోంది.

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ (ఎంఎంటీఎస్)

మొబైల్ మనీ ట్రాన్స్‌ఫర్ ద్వారా అత్యవసరంగా డబ్బును సులువుగా ఇతరులకు పంపే సౌకర్యం కలదు. డబ్బు పంపాల్సిన వ్యక్తికి మొబైల్ ద్వారా మెసేజ్ వెళ్తుంది. వెంటనే అందుబాటులో ఉన్న తపాలాశాఖ కార్యాలయానికి వెళ్లి డబ్బు పొందవచ్చు.

ఈఎంఓ.. : ఎలక్ట్రానిక్ ఈఎంఓ ద్వారా డబ్బులు వేగంగా పంపే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సీఓడీ..

క్యాష్ అండ్ డెలివరీ సీఓడీ అమలులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో సంప్రదించిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఆయా వస్తువులను సీఓడీ ద్వారా పొందవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన..

అప్పుడే పుట్టిన ఆడపిల్ల నుంచి పదేళ్లలోపు బాలికల తరపున వారి తల్లి, తండ్రి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు పొందవచ్చు. సంవత్సరంలో రూ.1000 నుంచి రూ.1లక్ష వరకు పొదుపు డిపాజిట్ చేసుకోవచ్చు.

టీటీడీ దర్శన టికెట్లు..

గతంలో తిరుపతికి వెళ్లే భక్తులకు జిల్లా కేంద్రంలోనే దర్శన టికెట్లు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అలా కాకుండా రూ.300 చెల్లించి దర్శన టిక్కెట్లు ఇక్కడి నుంచే పొందే అవకాశం తపాలాశాఖ కల్పిస్తోంది.

మరిన్ని సేవలు

పై సేవలే కాకుండా మైస్టాంప్.. మైఫొటో అనే వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజల ఫొటోలతో తపాలాశాఖ బిల్లను ముద్రించుకునే అవకాశం, ఎల్ఈడీ సౌకర్యం ద్వారా వివిధ వ్యాపార ప్రకటనలను చూసుకునే అవకాశం మీడియా పోస్ట్ ద్వారా లభించింది. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన, పాస్‌పోర్టు సేవలు, పోస్టల్ బ్యాంకు సేవలు, ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు స్టాంపుల సేకరణలో ఆసక్తి ఉన్న వారికి అనుకూలంగా అందమైన బొమ్మలతో రంగు రంగుల పోస్టల్ స్టాంప్‌లు ముద్రించి విక్రయిస్తారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



తపాలాశాఖ అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ పథకాలను వారి సంక్షేమం కోసం వినియోగించుకోవాలి. ఈ పథకాలు ఎంతో మేలు చేస్తాయి.

– నూర్ అహ్మద్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, హెడ్‌పోస్టాఫీస్, కర్నూలు

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆదివారం ఓ ప్రకటనలో తహసీల్దార్ శేషఫణి సూచించారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ కేవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.